మార్కెట్‌లో ఉల్లి లొల్లి షురూ

- కార్తీక మాసం దెబ్బకు ధరలు పైపైకీ
- కొయ్యకుండానే కన్నీరు వస్తుందంటున్న సామాన్యులు


మార్కెట్‌లో ఉల్లి అమ్మకాలు

పెనుగొండ: మార్కెట్‌లో ఉల్లి ధర ఘాటెక్కుతుంది. రెండు మూడు నెలలు పాటు ఆకాశాన్నంటి ధరలు కాస్త తగ్గి, మళ్లీ కార్తీక మాసంలో తిరిగి పెరుగుతుండడంతో సామాన్య కుటుంబాలకు ఉల్లి కంటతడి పెట్టిస్తుంది. అసలే కార్తీక మాసంలో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోతాయి. వీటికి తోడు ఉల్లి ధర కూడా పెరుగుతుండడంతో కూరలేమి కొనలేం..తినలేం అన్న పరిస్థితుల్లో ఉండాల్సి వస్తుందని సామాన్యులు వాపోతున్నారు. నెల రోజుల వ్యవధిలో ధరలు రెట్టింపు దాటి, మరింత వేగంగా పరిగెడుతుండడంతో ప్రజలు హడలిపోతున్నారు. ప్రజలకు నిత్యం కూరల్లో వాడకానికి ఉల్లికి ఉన్న స్థానం మొదటి వరుసలో ఉంటుంది. దీంతో ఉల్లి పాయలు వాడకం రోజురోజుకు తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మూడు నెలల క్రితం కేజీ ధర రూ.20 లోపు ఉండగా, నెలరోజుల్లో రూ.60 దాటి, తిరిగి రూ.40కి వచ్చి, వారం రోజుల్లోనే రూ.70 నుంచి రూ.80వరకూ పెరిగింది. దీంతో ఉల్లికోసే లోపే మార్కెట్‌లోకి వెళ్లి కొనుగోలు చేసినపుడే కన్నీళ్లు వస్తున్నాయంటూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గట్టుగా ఉల్లిపాయలు దిగుమతి కాకపోవడంతోనే ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఉల్లి వ్యాపారులు వివరిస్తున్నారు. ఉల్లి ధర మరింత పెరిగేఅవకాశం ఉందంటూ తెలిపారు. దీంతో హోటల్ వ్యాపారస్తులు ఉల్లి వినియోగం తగ్గించి, ఉల్లి స్థానంలో క్యాబేజీ వినియోగిస్తున్నారు.

శుభకార్యాలకు ధర ఘాటు

కార్తీక మాసం పురస్కరించుకొని శుభకార్యాలు ఎక్కువగా జరుగుతుంటాయి. పవిత్ర కార్తీక మాసంలో ఎక్కువగా కూరగాయలపైనే ఆధారపడుతుంటారు. దీంతో ఉల్లి ధరని తట్టుకొవడం కష్టసాధ్యంగా మారిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరితో పాటు హోటళ్ల నిర్వాహకులు ఉల్లి ధరతో గగ్గోలు పెడుతున్నారు. నిత్యం 50 నుంచి 100 కేజీల వరకూ ఉల్లిని ఓ మోస్తారు హోటళ్ల నిర్వాహకులు వినియోగిస్తూ ఉంటారు. ఉల్లి ధరల పెరుగుదల వల్ల రూ.2000 వరకూ భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లి స్థానంలో క్యాబేజీ వినియోగిస్తూ కాలం గడుపుతున్నా, ఉల్లి సలాడ్ అంటూ ఉల్లిప్రియులు కోరుతుంటే ఇవ్వలేక సతమతం అవుతున్నారు. దీంతో ఉల్లిని తప్పనిసరిగా అడిగే వారికి బిల్లులో అదనపు ధర వసూలు చేస్తున్నామని చెబుతున్నారు.

క్లుప్తంగా

శేరేపాలెంలో ఆరోగ్య సర్వే


శేరేపాలెంలో సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

మొగల్తూరు: మండలంలోని శేరేపాలెం గ్రామంలో మూడో రోజు బుధవారం కూడా ప్రాథమిక వైద్య శిబిరం కొనసాగించారు. మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ దినేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి సర్వే చేశారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య శిబిరానికి సుమారు 48 రోగులు పరీక్షించుకోగా 28 రోగులకు సుగర్, 12 మంది రోగులకు బీపీ ఉన్నట్లు గుర్తించగా 8 మందికి జ్వరాలు ఉన్నట్లుగా గుర్తించామని దినేష్ స్పష్టం చేశారు.

వాహన రికార్డులను వెంట ఉంచుకోవాలి


మొగల్తూరులో వాహనాలను తనిఖీ చేస్తున్న మహిళా ఎస్సై నాగలక్ష్మి

మొగల్తూరు: వాహనాలకు సంబంధించిన పత్రాలతో పాటు వాహనదారుని డ్రైవింగ్ లైసెన్స్, తప్పనిసరిగా ఉండాలని మహిళా అడిషనల్ ఎస్సై వై.నాగలక్ష్మి సూచించారు. బుధవారం మొగల్తూరు గాంధీ బొమ్మల సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ చిన్నపిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

27 నుంచి ఎస్‌వీకేపీలో తెలుగు సదస్సు


తెలుగు సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండ ఎస్‌వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు అటానమస్ కళాశాలలో ఈ నెల 27 నుంచి రెండ్రోజుల పాటు అంతర్జాతీయ తెలుగు సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు తెలిపారు. బుధవారం పెనుగొండ కళాశాలలో ఈ మేరకు బ్రోచర్ ఆవిష్కరించారు. ఎస్వీకేపీ కళాశాల, ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ, మద్రాస్ యూనివర్శిటీ సంయుక్తంగా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రోచర్‌ను కళాశాల పాలకవర్గ సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్ర రాజు, తెలుగు శాఖ పూర్వ విభాగాధిపతి ఆచార్య రంకిరెడ్డి రామ్మోహనరావు, నన్నయ్య యూనివర్శిటీ తెలుగు విభాగాధిపతి డాక్టర్ కేవీడీ వరప్రసాద్‌లు ఆవిష్కరించగా, కళాశాల తెలుగు విభాగాధిపతి షేక్ ఆదంషా, అధ్యాపకులు కే సురేష్ బాబు, కేవీ సుబ్బారావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

భీమవరం(ప్రకాశం చౌక్): త్యాగరాజ భవన్‌లో బుధవారం ఆర్యవైశ్య వర్తక సంఘం, ఏలూరు ఆశ్రమం ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో 480 మంది కంటి పరీక్షలు నిర్వహించారు. కొందరికి ఉచితంగా కళ్ల అద్దాలు, మరి కొందరికి మందులు అందజేశారు.

పుస్తకాలు చదివే అలవాటు పెంచుకోవాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం: ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదివే అలవాటును పెంచుకోవాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. గురువారం నుంచి నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాల నేపథ్యంలో బుధవారం వాల్ పోస్టర్లను ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. నరసాపురం గ్రేడ్-1 శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో జరగనున్న విజయవంతం చేయాలని కోరారు. గతంలో పుస్తకాలు చదివే అలవాటు ప్రతి ఒక్కరిలో ఉండేదని అన్నారు. లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి మాట్లాడుతూ వారం రోజుల పాటు గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించ దానికి ఏర్పాట్లు చేశామన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పాలకొల్లు సెంట్రల్: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారిణి వి. శాంతకుమారి బుధవారం విలేకరులకు తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ వారోత్సవాలు ప్రారంభమవుతాయని, నవంబర్ 20 వరకూ వారం రోజులు పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న మొదటి రోజు నీతి కథల పోటీలు, 15 దేశభక్తి గీతాల పోటీలు, 16న చిత్రలేఖన పోటీలు, 17న క్విజ్ పోటీలు, కవి సమ్మేళనం, 18న వ్యాసరచన పోటీలు, 19న మహిళా సాధికారత, 20న బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

తహసీల్దార్‌కు అభినందనలు


తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యలమంచిలి: ఇటీవల యలమంచిలి తహసీల్దార్‌గా గ్రంధి పవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఆయనను కలసి శుభాకాంక్షలు చెప్పారు. పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ సమన్యాయం చేయాలని నాయకులంతా కోరాగా ఆయన సానుకూలంగా స్పందించారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో మాజీ ఎంపీపీ రావూరి వెంకటరమణ, నాయకులు వినుకొండ రవి, రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, ఓదూరి భాస్కరరావు, బోనం బులి వెంకన్న, చివటపు నాగేశ్వరరావు, ఉచ్చుల స్టాలిన్, ఇలపకుర్తి నరసింహారావు, సర్పంచ్‌లు కపురు గోపి, వల్లభు సాయి వెంకట నరసింహారావు, పాలంకి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి


విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేస్తున్న కాపు క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థీ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని యునైటెడ్ కాపు క్లబ్ అధ్యక్షుడు జక్కంపూడి మదన్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌కేపీ అండ్ టీవీ ఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా కాపు క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మదన్ మాట్లాడుతూ క్రీడలకు ప్రాధాన్యతనివ్వడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శరీర ధృఢత్వం కూడా పెంపొందుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు క్యారంబోర్డులు, షటిల్ బ్యాట్స్, వాలీబాల్, బేస్ బాల్, క్రికెట్ బ్యాట్‌లు, బాల్స్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహన రావు, డాక్టర్ ముచ్చర్ల సంజయ్, సెక్రటరీ వేరుకొండ దుర్గాప్రసాద్, సత్తినీడి రాజా, కఠారి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: మనిషి ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండాలంటే క్రీడల వల్లే సాధ్యమవుతుందని నరసాపురం ఆర్‌డీవో దాసి రాజు అన్నారు. బుధవారం పాలకొల్లు పట్టణంలోని కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో సీహెచ్ బుద్ధావతారం రాజు మెమోరియల్ నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ సీనియర్స్ టెన్నిస్ పోటీల్లో 45 నుంచి 75 ఏళ్ల వయసు వారు పాల్గొంటున్నారని, వారిని యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. క్రీడాకారులకు, నిర్వహిస్తున్న కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్ సభ్యులకు అభినందనలు తెలిపారు. కాస్మో క్లబ్ చైర్మన్ గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు మాట్లాడుతూ ఈ పోటీలు 17 వరకూ జరుగుతాయన్నారు. పోటీలు పాలకొల్లు కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్, పాలకొల్లు టౌన్‌హాల్, నరసాపురం ఆఫీసర్స్ క్లబ్ గ్రౌండ్‌లో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్, క్లబ్ సభ్యులు అరిటాకుల రాంబాబు, సీహెచ్ వెంకటేశ్వర వర్మ, శ్రీనివాసరాజు, ఆర్.సత్యనారాయణరాజు, డి.గోపాలకృష్ణంరాజు, ఆర్.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు


సీతారామపురం ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసాపురం మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం ఆటల పోటీలు, ఫన్నీ గేమ్స్ నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి శుక్రవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బహుమతులను అందించనున్నారు. మండలంలోని సీతారామపురం ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం పులఖండం శ్రీనివాస్, వ్యాయామోపాధ్యాయుడు వరప్ర

విద్యుత్ తీగలపై గుమ్మడి కాయలు


విద్యుత్ తీగలపై గుమ్మడిపాదు పాకి కాయలు కాసిన దృశ్యం


ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

- ఒరిగిన విద్యుత్ స్తంభం
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రు రాపాక వారిపేటలో విద్యుత్ తీగలపైకి గుమ్మడి పాదు పాకి కాయలు కాసింది. అలాగే సాకా వారి పేటలో విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. దీంతో స్థానికులు భయాందోళనలకు గురి అవుతున్నారు. గుమ్మడి పాదు పాకి విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు చెబుతున్నారు. అలాగే ఒరిగిన విద్యుత్ స్తంభం మార్చాలని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. విద్యుత్ స్తంభం ఒరిగిపోవడంతో ఇంటిపైకి విద్యుత్ తీగలు వెళ్లడంతో స్థానికులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో విద్యుత్ లైన్‌మెన్ అందుబాటులో ఉండడం లేదని, అతనిపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్ వాపోయారు. తక్షణం అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

రేపు డివిజన్‌స్థాయి రెవెన్యూ అధికారుల సమావేశం

నరసాపురం: స్థానిక తెలగ కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10 గంటలు నుంచి డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారుల సమావేశం ఏర్పాటు చేసినట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నాగరాణి సమావేశం ప్రారంభించి పాల్గొంటారని చెప్పారు. భూసర్వే సమస్యలు, పట్టాదారు పాసు పుస్తకాల సమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యలపై అర్జీలు అందించాలని కోరారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

పెనుగొండ: ఆచంట మండలం వల్లూరు నిర్వహించిన దాడుల్లో మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు పాలకొల్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస రావు తెలిపారు. బుధవారం నిర్వహించిన దాడిలో ఐదు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు, బెల్ట్ షాపు నిర్వాహకుడు గుబ్బల బాలాజీని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సైలు మహేష్, జి.రఘు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా శెట్టి బలిజ సంఘాల కార్తీక వనసమారాధన

పెనుగొండ: మండలంలోని ములపర్రులో బుధవారం శెట్టి బలిజ సంఘాల కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సమస్యలు ఉంటే సంఘ పెద్దల ద్వారా చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్నారులు వన సమారాధనలో ఉత్సాహంగా గడిపారు. అనంతరం కార్తీక దామోదర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పితాని, గుత్తుల లోకేష్, బొక్కా విశ్వనాథం, కడలి శ్రీనివాస రావు, గుడాల లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవలో పోస్టల్ ఉద్యోగుల ప్రత్యేక శిబిరం


దేవలో పోస్టల్ ఖాతా బుక్ అందిస్తున్న పోస్టల్ సిబ్బంది

పెనుగొండ: మండలంలోని దేవలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో పోస్టాఫీసు ఖాతా ప్రారంభానికి ఉద్యోగులు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. పాలకొల్లు ఏఎస్‌పీ ఏపీ నరసింహరావు ఆదేశాల మేరకు పోస్ట్ మేనేజ్‌మెంట్ ఖాతా ఓపెన్ శిబిరాన్ని దేవ పంచాయతీలో నిర్వహించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధి ఖాతాల్లోనే జమ చేస్తుండడంతో ఈ నెల 15 వరకూ అన్ని పోస్టాఫీసుల్లో ఖాతా ప్రారంభించడానికి అవకాశం కల్పిస్తున్నట్లు పోస్టల్ ఉద్యోగులు తెలిపారు. కార్యక్రమంలో కె.ప్రసాద్, పి.జయంతరావు, ఎస్.అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు


రామలింగేశ్వరుని హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

పెనుమంట్ర: మండలంలోని నత్తారామేశ్వరం గ్రామంలో ఉన్న శ్రీ రామేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు బుధవారం లెక్కించారు. ఎనిమిది నెలల అనంతరం హుండీ లెక్కించగా రూ.4.83 లక్షలు లభించినట్లు ఆలయ ఈఓ ఆర్.గంగా శ్రీదేవి తెలిపారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం


శంకు ఆకారంలో వెలిగించిన దీపాలు


కేశవస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన శివలింగం

యలమంచిలి: స్థానిక కేశవస్వామి ఆలయంలో నిత్య కార్తీక మాస దీపోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. శివ, కేశవులకు అత్యంత ప్రీతికరమైన మాసం కావడంతో ఆలయంలో కేశవస్వామి మండపం ఎదురుగా కృతిమ శివలింగాన్ని ప్రతిష్టించారు. ప్రతి రోజూ ఆలయ ఆవరణలో శంకు, చక్ర, నామాలను వేసి వాటి చుట్టూ దీపాలను వెలిగిస్తున్నారు. శివ, కేశవుల దర్శనం, దీపోత్సవం ఒకే ప్రాంగణంలో జరుగుతుండడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి దేవేరులను దర్శించుకుని దీపోత్సవంలో భాగస్వాములవుతున్నారు. ఆలయ అర్చకులు వాడపల్లి గోపాలకృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో గ్రామ ప్రజల సహకారంతో జరుగుతున్న ఈ దీపోత్సవాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్ కుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు.

ఆచంటలో తెప్పోత్సవం

పెనుగొండ: క్షీరాబ్ది ద్వాదశి పురస్కరించుకుని ఆచంట ఆచంటేశ్వరుని ఆలయం వద్ద రామగుండం చెరువులో బుధవారం తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. తెప్పలను విద్యుత్ దీపాలు ప్రత్యేకంగా అలంకరించి సత్యనారాయణ స్వామి, మదన గోపాల స్వామి వార్లతో ఉత్సవం నిర్వహించారు. బాణసంచా కాల్పులు మధ్య తెప్పోత్సవానికి భక్తులు భారీగా హాజరై తిలకించారు. ఆలయ ఈఓ ఆదిమూలం సత్యనారాయణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కిటకిటలాడిన శివాలయాలు

క్షీరాబ్ది ద్వాదశి కావడంతో ఆచంట, పెనుగొండ మండలాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో స్వామి వార్లకు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొప్పర్రులో..

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రు సీతారామస్వామి ఆలయంలో చిలుకు ద్వాదశి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని దీపాలంకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ మాజీ చైర్మన్ చినమిల్లి వీరబాబు, యాదంరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.


కొప్పర్రులో తెప్పోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం


ఆచంట రామగుండం చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

17న పాలకొల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పాలకొల్లు అర్బన్: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 17న మధ్యాహ్నం 3గంటలకు జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.